క్లుప్తంగా

అప్పన్న అన్నప్రసాదానికి రూ.2.1 లక్షల విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న పీఆర్‌వో అప్పలనాయుడు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని రామ్‌నగర్ ప్రాంతానికి చెందిన కె.సంకేత, శ్రావ్య రూ.1,00,116 విరాళం, శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం గేదెలపేటకి చెందిన గేదెల రాజేష్ దంపతులు రూ.1,10,000 విరాళం శనివారం అందజేశారు. సంబంధిత విరాళాలను సింహగిరిపై ఉన్న పీఆర్‌వో కార్యాలయం వద్ద నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరఫున దాతలకు బాండ్‌లను పీఆర్‌వో అప్పలనాయుడు అందజేశారు. అనంతరం దాతలకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

ఉజ్వల్ గ్యాస్ కనెక్షన్లు అందజేత



సిలిండర్లు, స్టౌ అందజేస్తున్న గంట్ల శ్రీనుబాబు

సింహాచలం : కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న ఉజ్వల్ ఉచిత గ్యాస్ కనెక్షన్ల వల్ల ఎంతో మంది నిరుపేదలకు మేలు జరుగుతోందని సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు తెలిపారు. సింహాచలంలోని సింహగిరి హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ ద్వారా 150 మంది లబ్ధిదారులకు శనివారం ఉజ్వల్ ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనుబాబు లబ్ధిదారులకు స్టౌలు, సిలిండర్లు, రెగ్యులేటర్లు, పైపులు, డాక్యుమెంట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల వారికి ఉజ్వల్ ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఏజెన్సీ డీలర్ గంట్ల కిరణ్‌బాబు మాట్లాడుతూ తొలివిడతగా 150 మందికి ఉజ్వల్ గ్యాస్ కనెక్షన్లు తమ ఏజెన్సీ ద్వారా అందించామన్నారు. మరింతమందికి త్వరలోనే అందజేస్తామని తెలిపారు. అడవివరం, సింహాచలం పరిసర ప్రాంతాల అర్హులు సింహగిరి గ్యాస్ ఏజెన్సీలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు గౌతమి, సత్యవతి పాల్గొన్నారు.

న్యూపోర్టు పీఎస్‌ను సందర్శించిన డీసీపీ-2



పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీసీపీ-2 సత్యనారాయణ

పెదగంట్యాడ: శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవారు ఎంతటి వారైనా ఉపేక్షించవద్దని డీసీపీ-2 ఎం.సత్యనారాయణ తెలిపారు. న్యూపోర్టు పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకున్నారు. విధి నిర్వహణలో ఎవరూ నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని, పోలీసు స్టేషన్‌కు వచ్చేవారితో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను పాటించాలన్నారు. ఈ విషయంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు.

14 కిలోల గంజాయి సీజ్

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్లో శనివారం అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని రైల్వే భద్రతా దళం సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. 14 కిలోల గంజాయిని సీజ్ చేసి, అతడిని గవర్నమెంట్ రైల్వే పోలీసులకు అప్పగించారు. ఆర్పీఎఫ్ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. ఆర్పీఎఫ్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ సిహెచ్.రఘువీర్ ఆదేశాలతో ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ ఆధ్వర్యంలో ఏఎస్‌ఐ కె.అనంతరావు, సిబ్బందితో కలిసి శనివారం విశాఖ రైల్వేస్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫాంల్లో తనిఖీలు చేస్తుండగా.. గుజరాత్‌కు చెందిన భవేష్ కిషోర్ భాయ్ పంద్యా అనే వ్యక్తి వద్ద అక్రమంగా రవాణా చేసేందుకు సిద్ధంగా ఉన్న 14 కేజీల గంజాయిని గుర్తించారు. వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని, గంజాయిని సీజ్ చేసి, రిమాండ్ నిమిత్తం జీఆర్పీ సిబ్బందికి అప్పగించారు.

ఇది కదా అభివృద్ధి



నాడు : అధ్వానంగా ఉన్న భవానీనగర్ - లక్ష్మీపురం రహదారి



నేడు : కోటి రూపాయలతో నిర్మించిన భవానీనగర్ - లక్ష్మీపురం రహదారి

నాడు సుమారు ఆరేడు గ్రామాలను అనుసంధానించే జీవీఎంసీ 95వ వార్డు పాపయ్యరాజుపాలెం భవానీనగర్ - లక్ష్మీపురం రహదారి టీడీపీ పాలనలో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. సాధారణ సమయంలో గోతులతో.. వర్షాకాలంలో చెరువును తలపించే ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు నరకయాతన అనుభవించేవారు. అయినప్పటికీ నాటి ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. క్రమేనా రహదారి పూర్తిగా రంపపు కోతకు గురైంది. ఈ రహదారిలో ప్రయాణం అంటే నరకప్రాయమే అని స్థానికులు భయపడే పరిస్థితి నెలకొంది.

నేడు వైఎస్సార్‌సీపీ పాలనలో జీవీఎంసీ పాలకవర్గం ఏర్పడి ఏడాది కూడా కాలేదు. రోడ్డు నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సర్కారు ముందుకొచ్చింది. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సారథ్యంలో కార్పొరేటర్ ముమ్మన దేముడు ప్రతిపాదనతో కోటి రూపాయలు విడుదల చేసిన జీవీఎంసీ వెనువెంటనే పనులు ప్రారంభించింది. పూర్తిస్థాయి నాణ్యతతో దాదాపు 2.5 కిలోమీటర్ల రాచమార్గం నిర్మించింది. ప్రస్తుతం ఈ ప్రాంతానికి చెందిన ప్రజలు హాయిగా ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నారు.

భవానీనగర్ - లక్ష్మీపురం మధ్య రాచమార్గం

- రూ.కోటి నిధులతో రహదారి నిర్మాణం పూర్తి
- హర్షం వ్యక్తం చేస్తున్న 95వ వార్డు ప్రజలు

పెందుర్తి : గతంలో ప్రయాణం నరకప్రాయమే పాపయ్యరాజుపాలెం భవానీనగర్ - లక్ష్మీపురం రహదారి దాదాపు ఆరేడు గ్రామాలను కలుపుతుంది. పాపయ్యరాజుపాలెం, భవానీనగర్, పోర్టు కాలనీ, లక్ష్మీపురం, చీమలాపల్లి, పార్లపాలెం, చింతలగ్రహారం, గవరపాలెం ప్రాంతాల ప్రజలు పెందుర్తి రావడానికి ఇది దగ్గరి మార్గం. అయితే ఈ రహదారి టీడీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. రోడ్డు పూర్తిగా గోతులమయమై ప్రజలు కనీసం నడిచి వెళ్లేందుకు కూడా పనికిరాకుండా ఉండేది. ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు అనేకసార్లు అప్పటి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. అడుగడుగునా గోతులు ఏర్పడడంతో తరచూ ప్రమాదాలు కూడా సంభవించేవి.

ప్రస్తుతం సజావుగా సవారీ ..ఐదేళ్ల పాలనలో టీడీపీ ప్రభుత్వం ఈ రహదారిని గాలికి వదిలేస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రోడ్డు నిర్మాణానికి నడుము బిగించింది. జీవీఎంసీ పాలకవర్గం ఏర్పడిన వెంటనే ఈ రహదారి నిర్మాణానికి ప్రజాప్రతినిధుల చొరవతో రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. వెంటనే పనులు ప్రారంభం కావడంతో తాజాగా రోడ్డు నిర్మాణం పూర్తయింది. త్వరలోనే ఈ రోడ్డును ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

చాలా ఇబ్బందులు పడేవాళ్లం



భవానీనగర్ - లక్ష్మీపురం రోడ్డుపై ప్రయాణం చేస్తే మాకు సమయంతోపాటు వ్యయం కూడా తగ్గుతుంది. చిన్ననాటి నుంచి ఇదే మార్గంలో ప్రయాణం చేసేవాళ్లం. అయితే గతంలో ఈ రోడ్డు పూర్తిగా గోతులమయం కావడంతో చాలా అవస్థలు పడేవాళ్లం. అనేకసార్లు గోతుల్లో పడిన ఘటనలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం రోడ్డు పూర్తి స్థాయిలో నిర్మించడంతో నిమిషాల్లో మెయిన్ రోడ్డుకు చేరుకుంటున్నాం. ఈ ప్రాంతంలో నివసిస్తున్న రోజువారీ కూలీలకు ఈ రహదారి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– కంచిబోయిన సంతోష్, చీమలాపల్లి

ప్రభుత్వానికి ధన్యవాదాలు



గతంలో ఈ రోడ్డులో ప్రయాణం భయంగా ఉండేది. చాలా ఇబ్బందులు పడేవాళ్లం. కానీ సీఎం వైఎస్ జగన్ వచ్చాక ఈ రహదారి బాగుపడింది. ఏ అవసరం ఉన్నా లక్ష్మీపురం ప్రాంతానికి నిమిషాల్లో చేరుకోవచ్చు. పూర్తి స్థాయిలో రోడ్డు నిర్మించినందుకు ప్రభుత్వానికి, స్థానిక ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు.

– కె.వి.ఆర్.లక్ష్మి, పాపయ్యరాజుపాలెం

అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం



ఎన్నికల సమయంలో ప్రజలకు దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చాం. అవన్నీ నెరవేర్చే దిశగా బలంగా అడుగులు వేస్తున్నాం.
అత్యధికంగా 95వ వార్డుకు నిధులు కేటాయింపు జరగడం సంతోషంగా ఉంది. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, మేయర్ గొలగాని హరివెంకటకుమారి సహకారంతో నియోజకవర్గ పరిధిలోని జీవీఎంసీ ప్రాంతాలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తాం.

– ముమ్మన దేముడు, కార్పొరేటర్ 95వ వార్డు.

శ్యామా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



గోపూజ చేస్తున్న భక్తులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీ దేవి ఆరాధనా పీఠంలో శ్యామా నవరాత్రి ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా గోపూజతో వేడుకలకు శ్రీకారం చుట్టారు. అనంతరం శ్రీయంత్ర మహామేరు మొదటి అంతస్తుకు ఉత్సవ మూర్తులను మేళ తాళాలతో తోడ్కొని వెళ్లి, బ్రహ్మపీఠంపై ఆరోహణం చేశారు. పవిత్ర జలాలతో కలశ స్థాపన చేసిన అనంతరం రాజశ్యామల అమ్మవారికి చతుష్షష్టి ఉపచారాలను విధానపూర్వకంగా అర్పించారు. సుగంధాది తీర్థజలాలు, క్షీర, పంచామృత ద్రవ్యాలతో అభిషేకించి నూతన వస్త్రాభరణాలను అమ్మవారికి అలంకరించారు. సాయంత్రం అమ్మవారి సన్నిధిలో లఘు శ్యామవహనం నిర్వహించారు. కార్యక్రమంలో కెనడా నుంచి వచ్చిన డల్లాస్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వెంకట రమణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు

అక్కిరెడ్డిపాలెం: హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, బొల్లినేని మెడ్ స్కిల్స్ సంయుక్తంగా బ్యుటీషియన్, ఫుడ్ అండ్ బెవరేజ్ సర్వీస్ అసోసియేట్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు శనివారం తెలిపారు. ఈ కోర్సుల్లో చేరేందుకు పదో తరగతి/ఇంటర్ పూర్తి చేసిన 18 నుంచి 28 ఏళ్ల లోపు వయసు గల పురుషులు, మహిళలు అర్హులని తెలియజేశారు. మూడు నెలల శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గలవారు 91219 99624, 79930 11605 నంబర్లను సంప్రదించి, పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో సంప్రదించాలని తెలియజేశారు.

సనాతన ధర్మాన్ని వారసత్వంగా అందించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సప్తరుషి వ్యవస్థాపకులు మాధవశర్మ

సబ్బవరం: సనాతన ధర్మాన్ని, వేదాల సారాన్ని దేశంలోని యువతకు వారసత్వంగా అందించాలని సప్తరుషి ఆశ్రమం, వేద పాఠశాల వ్యవస్థాపకులు మావుళ్లపల్లి మాధవశర్మ కోరారు. సప్తరుషి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని గొల్లలపాలెం గ్రామంలో శనివారం నిర్వహించిన వేద భారత పరిక్రమ యాత్ర విజయోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విశ్వవ్యాప్తంగా ప్రతీ ఒక్కరికీ జగద్గురు ఆది శంకరాచార్యులు ఆదర్శనీయమని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు సాగాలన్నారు. శంకరులు 32 సంవత్సరాల వయసులోనే భారతావనిని నాలుగు సార్లు చుట్టివచ్చి, సనాతన ధర్మాన్ని కాపాడటంతో పాటు ధర్మ సంస్థాపనార్థం నాలుగు దిక్కుల్లో నాలుగు పీఠాలను స్థాపించారన్నారు. ఆయన సందేశాన్ని, వేదాల సారాంశాన్ని విశ్వ వ్యాప్తం చేసి, ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక భావాలను అలవరచుకోవాలన్నారు. శంకరాచార్యులు పలు స్తోత్రాలు, గ్రంథాలు, భాష్యాలు రచించారన్నారు. 35 రోజుల పాటు తాము నిర్వహించిన వేద పరిక్రమ యాత్రలో దేశంలోని పలు పవిత్ర స్థలాలను దర్శించుకోవడంతో పాటు పాకిస్థాన్ సరిహద్దు ప్రాంతాల్లో పర్యటించి హిందూ ధర్మాన్ని వ్యాప్తిచేయడంలో భాగంగా వేద పారాయణం, అనేక హోమాలు జరిపించినట్లు తెలిపారు. ముందుగా జ్యోతిష్య, న్యూమరాలజీ పండితులు డాక్టర్ నారాయణమూర్తి పట్నాయక్, పోలాప్రగడ సుబ్బారావు తదితరులు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాధవశర్మను ఘనంగా సత్కరించారు.

సమ్మె పోస్టర్ ఆవిష్కరణ



ఉక్కునగరం: ఈ నెల 16వ తేదీన జరప తలపెట్టిన దేశవ్యాప్త పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని అఖిలపక్షాల నాయకులు కోరారు. ఈ మేరకు సమ్మె పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. విశాఖ ఉక్కు కర్మాగారం అఖిల పక్షాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు కె.ఎస్.ఎన్.రావు, మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పారిశ్రామిక సమ్మె, భారత గ్రామీణ బంద్‌కు సంఘీభావంగా జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు విశాఖ ఉక్కులో నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు నీరుకొండ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. నృసింహుని నిత్య కల్యాణం



కంకణధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం శనివారం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై ఉదయం 9.30గంటలకు ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కొలువుదీర్చి ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

కట్టుకున్న చీరే యమపాశమై..

- మిషన్‌లో చిక్కుకున్న మహిళ చీర
- మిగిలిన భాగం మెడకు బిగుసుకుపోవడంతో ఊపిరాడక మృతి
- పరవాడ కర్రల యార్డులో ప్రమాదం



మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

పరవాడ : కట్టుకున్న చీరే యమపాశమై తనను అనంత లోకాలకు అర్థంతరంగా తీసుకుపోతుందని ఆ మహిళ ఊహించలేకపోయింది. ఎప్పటిలాగే పని చేసుకుంటుండగా మిషన్‌లో చీర చిక్కుకోగా... మిగిలిన భాగం ఆ మహిళ మెడకు బిగుసుకుపోయి క్షణాల్లోనే ఊపిరాడక మృతి చెందింది. ఈ దుర్ఘటన మండలంలోని పరవాడ సినియా హాలు జంక్షన్‌లో ఏర్పాటు చేసిన కర్రల యార్డులో శనివారం సంభవించింది. ఈ ఘటనలో వెన్నెలపాలెం గ్రామానికి చెందిన వెన్నెల సూర్యనారాయణమ్మ (55) మృతి చెందింది. పరవాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పరవాడ సినిమా హాల్ జంక్షన్‌లోని కర్రల యార్డులో సూర్యనారాయణమ్మ మూడేళ్లుగా రోజు కూలీగా పనిచేస్తోంది. శనివారం మధ్యాహ్నం యార్డులో తొక్క తీసే మిషన్‌కు కర్రలు అందిస్తుండగా ఆమె చీర మిషన్‌లో చిక్కుకుంది. కొద్దిసేపటిలోనే ఆ చీర మిగిలిన భాగం సూర్యనారాయణమ్మ మెడకు గట్టిగా బిగుసుకుపోవడంతో ఆమెకు ఊపిరాడక అక్కడికక్కడే మృతిచెందింది. మృతిరాలికి ఇద్దరు సంతానంతోపాటు భర్త ఉన్నారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు యార్డు వద్ద ఆందోళన చేశారు. మృతురాలి కుటుంబ సభ్యులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. సమాచారం అందుకున్న పరవాడ ఎస్‌ఐ మల్లేశ్వరరావు ఘటనా స్థలికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు పర్యవేక్షణలో ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారన్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

అగనంపూడి: దువ్వాడ రైల్వే స్టేషన్‌కు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డారు. విజయవాడ నుంచి విశాఖ వైపు వెళ్లే ట్రాక్‌పై ఈ సంఘటన చోటు చేసుకుంది. దువ్వాడ జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. అగనంపూడి ఫ్లై ఓవర్ వంతెనకు సమీపంలో డొంకాడ కాలనీకి ఎదురుగా ఉన్న రైల్వే ట్రాక్‌పై సుమారు 35 సంవత్సరాల వయసు ఉన్న వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి, దువ్వాడ జీఆర్‌పీ ఔట్ పోస్టుకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. తల, మొండెం వేరుగా ఉండడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు నిర్ధారించినట్లు తెలియజేశారు. శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెంది ఉంటారని తెలిపారు. మృతదేహంపై ఆకుపచ్చ రంగు టీ షర్ట్, నీలం రంగు ఫుల్ ట్రాక్ ఉంది. మృతుని వివరాల కోసం 9491782534 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

19న కళాతపస్వి విశ్వనాథ్ జయంతి

దాబాగార్డెన్స్ : కళా తపస్వి డాక్టర్ కె.విశ్వనాథ్ జయంతిని పురస్కరించుకుని 19వ తేదీన ఎంవీఆర్ ఈవెంట్స్, యాక్మీ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 'విశ్వనాథం' సినీ సంగీత విభావరి నిర్వహించనున్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి కేవీ రమణాచారి పోస్టర్ ఆవిష్కరించారు.నిర్వాహకులు మాట్లాడుతూ కళాభారతి ఆడిటోరియంలో ఆ రోజు సాయంత్రం 6 గంటల నుంచి నిర్వహించనున్న సంగీత విభావరిని విజయవంతం చేయాలని కోరారు.

అప్పన్న సన్నిధిలో ఎమ్మెల్యేలు





కప్పస్తంభానికి మొక్కుకుంటున్న ఎమ్మెల్యేలు అన్నంరెడ్డి అదీప్‌రాజ్, ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శనివారం దర్శించుకున్నారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో వారి పేరిట ప్రత్యేక పూజలు చేశారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని దేవస్థానం అధికారులు అందజేశారు. దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు సూరిశెట్టి సూరిబాబు, 93, 98 వార్డుల వైఎస్సార్‌సీపీ నాయకులు వినోద్, పీతల విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నకు తోమాల సేవ



ఆలయంలో తులాభారం నిర్వహిస్తున్న దృశ్యం



పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, అనంతరం తోమాల సేవ జరిపించారు. సహస్ర నామార్చన, అష్టోత్తరం, ధూపసేవ జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

అపూర్వ సమ్మేళనం

- విభాగంలో సందడి చేసిన 1992–94 బ్యాచ్ కెమిస్ట్రీ విద్యార్థులు



తాము చదువుకున్న విభాగం వద్ద పూర్వ విద్యార్థులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మూడు దశాబ్దాల క్రితం విద్యార్థిగా చేరిన వారంతా కలుసుకున్నారు. శనివారం కెమిస్ట్రీ విభాగం దీనికి వేదికైంది. 1992–94 సంవత్సరంలో ఏయూలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ కోర్సును చదువుకున్న సుమారు యాభై మంది విద్యార్థులు సమావేశమయ్యారు. ఉదయం విభాగాన్ని సందర్శించారు. తాము చదువుకున్న విభాగాన్ని, తరగతి గదులు, ప్రయోగశాలలను చూసి కళాశాల రోజులను గుర్తు చేసుకున్నారు. నేడు దేశ విదేశాలలో అత్యున్నత స్థానాలలో స్థిరపడిన వీరంతా చిన్నపిల్లల్లా మారిపోయి పాత జ్ఞాపకాలతో జ్ఞప్తికి తెచ్చుకున్నారు. కళాశాలల్లో తమకు బోధన చేసిన గురువులను గుర్తుచేసుకున్నారు. తమ ఉన్నతికి కారణమైన విశ్వవిద్యాలయానికి, విభాగానికి కృతజ్ఞతలు తెలిపారు.

వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన చేపట్టారు. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

యువతకు ఉపాధి కల్పతరువు స్టీల్‌ప్లాంట్



దీక్షలో పాల్గొన్న అగనంపూడి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు

కూర్మన్నపాలెం: విశాఖ స్టీల్‌ప్లాంట్ భావితరాల యువతకు ఉపాధి కల్పించే కల్పవృక్షం వంటిదని అగనంపూడి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. అటువంటి ప్లాంట్‌ను ప్రభుత్వరంగ సంస్థగానే నడపాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1094వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో అగనంపూడి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు జి.బోసుబాబు, సభ్యులు, స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగులు, పలువురు కార్మికులు పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముకుంటూ పోతే భారతదేశంలో ఏ ప్రభుత్వరంగ సంస్థా మిగలదన్నారు. భావితరాలకు మంచి భవిష్యత్తును అందించేందుకు స్టీల్‌ప్లాంట్ వంటి సంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.